సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



వెజి'ట్రబుల్స్'

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. 10లో▸



బీజేపీతోనే సమ న్యాయం

బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. 10లో▸



ప్రైవేటుకు దీటుగా..

ప్రైవేటుకు దీటుగా గురుకుల కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ ఇఫ్ఫాత్ జాన్ తెలిపారు. 11లో▸

న్యూస్‌రీల్

ఘనంగా వీడ్కోలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

అనంతగిరి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. గురువారం వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ న్యాయమూర్తి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శ్రుతిదూత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తాం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ



మాట్లాడుతున్న మల్లికార్జున్ మాదిగ

తాండూరు టౌన్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ తెలిపారు. గురువారం తాండూరులోని కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు పార్లమెంట్ స్థానాలు ఎస్సీ రిజర్వేషన్ ఉండగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమను అవమానించిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ఊరూరా ప్రచారం చేస్తామన్నారు. మాదిగలపై కపట ప్రేమ చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించిన బీజేపీకే మా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు నర్సింహులు, స్వామిదాస్, కృష్ణ, మహేందర్, సూర్యప్రకాష్, ప్రకాష్, గోపాల్, ప్రవీణ్, జగదీష్ పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం

జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

అనంతగిరి: మలేరియాను నిర్మూలించడం మనందరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి మలేరియాను పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మలేరియా రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఓహెచ్‌ఆర్‌లు, సంపులు, డ్రమ్ములు, నీటి తొట్టెలపై మూతలు ఉంచాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంట్లో ఉన్న నీటిని పారబోసి కొత్తగా నింపుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడాలన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



మహిళలకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ప్రభులు

కుల్కచర్ల: అర్హులు విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు సూచించారు. గురువారం చౌడాపూర్‌లో పలువురికి ఓటరు స్లిప్పులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం మన బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్పులు అందేలా చూస్తామని తెలిపారు.

ధాన్యం దిగుబడి మరింత ఆలస్యం

జిల్లాలో వరినాట్లు జాప్యం కావడమే కారణం

- ఇప్పుడిప్పుడే ప్రారంభమైన కోతలు
- మరో నెలరోజులపాటు కొనసాగే అవకాశం
- 90వేల ఎకరాల్లో పంట సాగు
- 1.19లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- 129 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



పరిగిలో ఇటీవల ప్రారంభించిన కొనుగోలు కేంద్రం

వికారాబాద్: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా జిల్లాల్లో ఇప్పటికే చాలా వరకు ధాన్యం సేకరణ పూర్తి కాగా మన జిల్లాలో ఇంకా ప్రారంభం కాలేదు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మన జిల్లాలో నెలన్నర తర్వాత వరి నాట్లు వేస్తారు. కొందరు రైతులు మార్చి మొదటి వారం వరకు కూడా నాట్లు వేశారు. ఈ కారణంగా పంట దిగుబడి ఆలస్యంగా చేతికందుతుంది. రైతులు ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభించారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15రోజులు కావస్తున్నా ఇంకా ధాన్యం కేంద్రాలకు రావడం లేదు.

తగ్గిన కొనుగోలు కేంద్రాలు

గత సీజన్‌తో పోలిస్తే ఈ సారి వరి సాగు తగ్గింది. గతంలో 167 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది వాటిని 129కు కుదించారు. జిల్లాలో వరి నాట్లు ఆలస్యంగా వేసిన కారణంగా ఈ నెలాఖరుకు పంట చేతికి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 90 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. ఎకరాకు సగటున 15నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 1.19లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఈ పంట మొత్తం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎండిన పంటలు

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నీరందక దిగుబడి తగ్గింది. దాదాపు 15వేల నుంచి 20 వేల ఎకరాల్లో పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు అనుకున్న మేరకు ధాన్యం రాకపోవచ్చని అధికారులు అంటున్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. సాధారణ రకానికి రూ.2,183 చెల్లించనున్నారు.

పొరపాట్లకు ఆస్కారం లేకుండా..

గత యాసంగిలో తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. గతేడాది సెర్ప్, మార్కెట్ కమిటీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం సేకరించారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఎక్కువ శాతం కొనుగోలు చేశారు. అయితే సెర్ప్ (గ్రామైక్య సంఘాల) రెండేళ్లుగా ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపడంలేదు. ఇందుకు కారణం లేకపోలేదు. గత యాసంగిలో బ్యాగుకు కిలో రెండొందల గ్రాములు తరుగు తీసి కొనుగోలు చేశారు. అయితే రైసు మిల్లర్లు మాత్రం బ్యాగుకు ఐదు నుంచి ఏడు కేజీల తరుగు తీశారు. ఈ విషయాన్ని గ్రామ సంఘాల మహిళలు రైతులకు చెప్పలేక ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు ఎక్కువ తరుగు తీయడం ద్వారా రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు నష్టపోయారు. దీంతో వారు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రాలేదు. ఈ సారి అలాంటి వాటికి అవకాశం ఉండదని అధికారులు హామీ ఇవ్వడంతో ముందుకు వచ్చారు. వీరితో పాటు పీఏసీఎస్‌లు, మార్కెట్ కమిటీలు, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం సేకరించనున్నారు. అవసరం మేరకు గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు.

పక్కాగా ఏర్పాట్లు



గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలుకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నాం. తాలు, తరుగు, తేమ, మట్టి పెల్లల శాతం ఎంత ఉండాలనే దానిపై కేంద్రాల నిర్వాహకులకు ముందుగానే శిక్షణ ఇచ్చాం. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

సమన్వయంతో పనిచేయండి

ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్‌చావ్రా



ఎన్నికల ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న రాజీవ్ చావ్రా

అనంతగిరి: అధికారులు సమన్వయంతో పని చేసి లోక్‌సభ ఎన్నికలను సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా సూచించారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు.. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ, జెడ్పీ సీఈఓ సుధీర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్ శివారులోని తెలంగాణ – కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టును గురువారం పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. డబ్బు, మద్యం తరలించే వాహనాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక చొరవతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రపంచంలో అగ్ర దేశాలతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు. నాగారంలోని కుండె వెంకటేశ్ ఫామ్‌హౌస్‌లో గురువారం పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు సుధాకర్ శర్మ, బస్వ పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ తదితరులు పాల్గొన్నారు.

'కొండా'ను గెలిపించండి

కందుకూరు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దెబ్బడగూడలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలతో సమావేశమై బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, జిల్లా నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, మంద పాండు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు క్లెం సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కె.చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాంసింగ్‌తండాలో మిషన్ భగీరథ నీటిని పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

తండాకు తప్పనున్న నీటి పాట్లు

- గ్రామాన్ని సందర్శించిన డీపీఓ జయసుధ
- రూ.60 వేలతో రెండు బోరు మోటార్లు మంజూరు చేస్తామని వెల్లడి

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: రాంసింగ్‌తండాలో నెలకొన్న తాగునీటి సమస్యపై గురువారం సాక్షి దినపత్రికలో గుక్కెడు మహాప్రభో అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జిల్లా, మండల అధికారులు స్పందించారు. ఉదయం తొమ్మిది గంటలకే ఎంపీడీఓ జర్నప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అకిల్, పంచాయతీ కార్యదర్శి రవి తండాకు చేరుకున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై స్థానికులతో చర్చించారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న రెండు బోర్లను పరిశీలించారు. మోటార్లు బిగిస్తే నీరు వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత డీపీఓ జయసుధ తండాకు వచ్చి నీటి సమస్యపై ఆరా తీశారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా వస్తుందా.. ఆ నీరు ఎందుకు తాగడం లేదని తండా వాసులను అడిగారు. మిషన్ భగీరథ నీరు తాగితే దురదలు వస్తున్నట్లు స్థానికులు వివరించారు. దీంతో తాగడం లేదని, వ్యవసాయ బోర్ల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రజలంతా మిషన్ భగీరథ నీరే తాగుతున్నారని మీరు కూడా తాగొచ్చని డీపీఓ సూచించారు. ప్రభుత్వం తాగునీటి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

రూ. 60వేలతో రెండు బోరు మోటార్లు

తండాలో నిరుపయోగంగా ఉన్న రెండు బోర్లకు రూ.60 వేలు ఖర్చు చేసి రెండు మోటార్లు బిగించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అకిల్ తెలిపారు. నీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. పది రోజులకు ఒక్కసారి మంచినీటి ట్యాంకును శుభ్రం చేయిస్తామని ఎంపీడీఓ జర్నప్ప చెప్పారు. వారంలో మూడు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శి రవి తండా వాసులకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

64 మంది అభ్యర్థులు | 88 నామినేషన్లు

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- చేవెళ్ల లోక్‌సభ స్థానానికి భారీగా పోటీ
- నేడు నామినేషన్ల పరిశీలన
- రేపటి నుంచి 29 వరకు ఉపసంహరణ
- 29న అభ్యర్థుల తుది జాబితా విడుదల
- మే 13న పోలింగ్ జూన్ 4న ఫలితాలు



బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన తనయుడు వీరేశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. ఆఖరి రోజు అభ్యర్థులు భారీగా నామినేషన్లు వేశారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి 64 మంది అభ్యర్థులు 88 నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి నాలుగో సెట్‌ను దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున ఆయన తనయుడు కాసాని వీరేశ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. శనివారం నుంచి 29 వరకు ఉపసంహరణ కార్యక్రమం కొనసాగుతుంది. 29న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు. మే 13న ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. జూన్ 6తో ఎన్నికల ఘట్టం ముగియనుంది.

నాగర్ కర్నూల్ నుంచి బీజేపీ అభ్యర్థి

అమనగల్లు: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సుధాకర్‌రెడ్డి, జక్క రఘునందరెడ్డి తదితరులు ఉన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి భరత్

అడవిని ధ్వంసం చేస్తే చర్యలు



గిరిజనులతో మాట్లాడుతున్న అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్

డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్

ధారూరు: అటవీ ప్రాంతంలో చెట్లను నరికి నాశనం చేస్తే చర్యలు తప్పవని డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. చెట్లు మానవ మనుగడకు ఎంతో అవసరం అన్నారు. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని బాణాపూర్, సంగాయపల్లి అటవీ ప్రాంతలో చెట్లను నరికి సాగు భూములుగా మారుస్తున్నారన్న ఫిర్యాదుతో ఆయన గురువారం తనిఖీలు చేశారు. అయా తండాల గిరిజనులతో సమావేశమై అవగాహన కల్పించారు. పోడు పట్టాల కోసం అడవులను నరికితే గతంలో పొందిన పట్టాలను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

సెక్షన్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

రాస్నం సెక్షన్ అధికారి మొహినుద్దీన్‌పై స్థానిక గిరిజనులు డీఎఫ్‌ఓకు ఫిర్యాదు చేశారు. అటవీ భూములను ఆక్రమించారని, తమను బెదిరిస్తూ నగదు, మేకలు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేస్తామని డీఎఫ్‌ఓ హామీ ఇచ్చారు.

చక్రస్నానం.. ఉత్సవాలు పరిసమాప్తం

- ముగిసిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు
- చివరిరోజు ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



గండిపేట చెరువులో స్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మొయినాబాద్: ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు గురువారం చక్రస్నానంతో ముగిశాయి. స్వామివారికి సర్వసైన్యాధిపతి అయిన చక్రస్వామి ఆధ్వర్యంలో చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలోని హోమ గుండాల గదిలో పూర్ణాహుతి చేపట్టారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా పెట్టి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అద్దాలపల్లకీలో ఆసీనులను చేసి అలంకరించారు. అనంతరం చక్రస్వామి, నవపాలికలు, స్వామివారిని పల్లకిలో దేవాలయం చుట్టూ ఊరేగించారు. శివాలయం పక్కనే ఉన్న మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజతో దేవుళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం నిర్వహించారు. తరువాత చక్రస్వామిని ఆలయ సమీపంలో ఉన్న గండిపేట చెరువులోకి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. సాయంత్రం ఆలయ అర్చకులు గరుడ పటాన్ని అవరోహణం చేసి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. ఉత్సవాలకు చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాకృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహన్, కిట్టు, కన్నయ్య, సురేశ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంగమేశ్వరుడి సేవలో స్పీకర్



ఆలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామ సమీపంలో వెలిసిన సంగయ్యలొంక శ్రీ సంగమేశ్వరాలయాన్ని గురువారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హామీలు నెరవేర్చండి
మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



పంటలు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంలో పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ రైతులకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. హామీలను నెరవేర్చకపోవడంతో రైతులు గోస పడుతున్నారన్నారు. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. మండలంలోని పులుసుమామిడిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

మామిడి చెట్లకు బహిరంగ వేలం



వేలంపాటలో పాల్గొన్న జేడీ రామలక్ష్మి తదితరులు

అనంతగిరి: వికారాబాద్‌లోని ఉద్యానవన నర్సరీలో ఉన్న మామిడి చెట్ల ఫలసాయానికి గురువారం బహిరంగ వేలం నిర్వహించారని జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరక్టర్ రామలక్ష్మి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, తాండూర్ డీపీ వినోద్‌కుమార్ పాల్గొని బహిరంగ వేలం చేపట్టారు. స్థానికంగా ఉన్న బాబు రూ.2.75 లక్షలకు ఫలాలను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారులు అర్చన, కమల, గఫూర్, స్నేహిత తదితరులు ఉన్నారు.

పరిగి వాసికి పీహెచ్‌డీ



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రీశైలం

పరిగి: మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్దులపల్లి శ్రీశైలం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. యూనివర్సిటీ చరిత్ర విభాగంలో 'ఇంటలెక్చువల్ సపరేట్ తెలంగాణ స్టేట్ మూవ్‌మెంట్ ఏ కేస్ స్టడీ ఆఫ్ ప్రొఫెసర్ జయశంకర్' అనే అంశంపై అధ్యాయనం చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు. పరిగి ప్రాంత వాసికి డాక్టరేట్ రావడంపై పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

డీజిల్ ట్యాంకర్ అప్పగింత



పట్టుబడ్డ డీజిల్ ట్యాంకరు

మోమిన్‌పేట: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకరును పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మోమిన్‌పేటలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక కుంచారం గ్రామం నుంచి ఓ ట్యాంకరులో 2500 లీటరుల డీజిల్‌ను తీసుకు వస్తుండగా దేవరంపల్లి సమీపంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. ట్యాంకరు డ్రైవరును వివరాలు అడిగితే పొంతన లేని సమాధానం ఇవ్వడంతో పోలీసులకు అప్పగించారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చామని వారి దగ్గర నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ అరవింద్ తెలిపారు.

వెజిట్రబుల్స్

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- అదే బాటలో మటన్, చికెన్ రేట్లు
- సామాన్యుల విలవిల



పేరు	కిలో(రూ)
వెల్లుల్లి	240
బీన్స్	200
అల్లం	200
పచ్చి మిర్చి	100
మునగ	80
చిక్కుడు	80
క్యారెట్	80
బెండ	60
దొండ	60
బీర	60
ఆలు	40
క్యాబేజీ	40
కీర	40
ఉల్లి	30
టమాట	20

తాండూరు: నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు ఆకాశాన్ని తాకుతున్నాయి. రోజూ వాడే కూరగాయలతో పాటు మటన్, చికెన్ రేట్లు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. పప్పన్నముతో అయినా కడుపు నింపుకొందామనుకుంటే వాటి ధరలు సైతం చుక్కలను అంటాయి. దీంతో సామాన్యుల ఖర్చుల భారం తడిచి మోపెడవుతోంది.

రెట్టింపైన ఖర్చులు

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. పక్షం రోజుల నుంచి ధరలు రోజురోజుకు పెరుగుతూ వస్తున్నాయి. తాండూరు మార్కెట్‌లో టమాట ధర రూ.20 కిలో ఉండగా మిగతా కూరగాయల ధరలు మరింత పెరిగాయి. పక్షం రోజుల క్రితం వరకు పచ్చి మిర్చి ధర కిలోకు రూ.60 పలకగా తాజాగా కిలోకు రూ.100 పలుకుతోంది. మరోవైపు ఉల్లి ధరలు కిలో రూ.10 పలకగా గురువారం ఏకంగా రూ.30కి చేరింది. ఇలా అన్ని కూరగాయ ధరలు అధికంగానే మండిపోతున్నాయి. గతంలో ఒక కుటుంబానికి వారానికి రూ.300 కూరగాయలు తీసుకెళ్లే వారు నేడు రూ.600 ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతి నెల కూరగాయలకే రూ.1200 నుంచి 1,500 వరకు వెచ్చిస్తున్నారు.

అల్లం పోటు!

ఏ వంటకం అయినా సరే అల్లం వెల్లుల్లి పేస్ట్ లేనిది రుచి ఉండదు. దీంతో అల్లం వెల్లుల్లి ధరలు ఎన్నడు లేని రీతిలో ఆకాశాన్ని తాకుతున్నాయి. మరో నెల రోజుల్లో పచ్చళ్ల సీజన్ కావడంతో పలు కుటుంబాలు సంప్రదాయ బద్ధంగా మామిడికాయ, టమాట, నిమ్మకాయ పచ్చడి లాంటివి తయారు చేసుకుంటారు. ఎక్కువ రోజుల పాటు పచ్చళ్లు నిల్వ ఉండాలంటే అందుకు కావాల్సిన అల్లం, వెల్లుల్లి తప్పనిసరిగా వాడుతారు. దీంతో పచ్చళ్ల సీజన్‌కు ముందే తాండూరు మార్కెట్‌లో అల్లం కిలో ధర రూ.200, వెల్లుల్లి కిలో ధర రూ.240 పలుకుతున్నాయి. అల్లం ధరలు ప్రజలకు మరింత భారంగా మారాయి. బీన్స్ సైతం కిలో రూ.200లకు చేరి సామాన్యుడికి అందనంత ఎత్తులో నిల్చోంది.

నామమాత్రంగా సాగు

ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో కూరగాయల పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దీంతో మార్కెట్లో కూరగాయల ధరలు అధికంగా పలుకుతున్నాయి. తాండూరు ప్రాంతంలో సాగు నామమాత్రంగా సాగవుతోంది. దీంతో వ్యాపారులు కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నారు. దీంతో ధరలు అధికంగా పలుకుతున్నాయి.

దేవాలయ భూములను కాపాడాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: దేవాదాయశాఖ భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ భూముల అన్యాక్రాంతంపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాదాయ శాఖకు సంబంధించి సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలను అందించాలన్నారు. వీటిని ధరణి పోర్టల్‌లో గల వివరాలతో సరి చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దేవాదాయశాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసే భూములను పరిరక్షించాలని ఆయన తెలిపారు. సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తాండూర్, వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం డీఏఓలు మునీరుద్దీన్, గోవిందమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే సమ న్యాయం



మాట్లాడుతున్న మాధవరెడ్డి

పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: బీజేపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఎన్నెపల్లిలోని ఓ పంక్షన్ హాల్‌లో చేవేళ్ల పార్లమెంట్ ఎస్సీ మోర్చా ఆత్మీయ సమ్మేళనాన్ని కన్వీనర్ నవీన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్‌తో దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ పాటుపడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు తీసుకువచ్చిందని, మూడోసారి మోదీని పీఎం చేయాలని ఆయన కోరారు. బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ పురుషోత్తం, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



కొనుగోలు కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గోపాల్

కుల్కచర్ల: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధలకు అనుగుణంగా ధాన్యాన్ని సేకరించాలన్నారు. రైతులు ధాన్యం అమ్ముతున్న క్రమంలో ఎటువంటి ఇబ్బందులు కల్గించకుండా చూడాలన్నారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఇవ్వాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతగిరి: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సంస్థలో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు అనాథ బాలికలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ ఒక ప్రకటన కోరారు. తల్లిదండ్రులు లేదా తల్లి, తండ్రిలో ఒకరిని కోల్పోయిన బాలికలు డిప్లొమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే దివ్యాంగ బాలికలు సైతం అర్హులన్నారు. బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని ఆమె తెలిపారు. ఈ కోర్సులలో మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారన్నారు. కోర్సుకు ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం ఉంటున్నారు. దరఖాస్తు ఫారానికి సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి మే 20 తేదీ లోపు సమర్పించాల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు 96408 63896, 98496 72296 సంప్రదించవలసిందిగా ఆమె పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

కొడంగల్: అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. తాండూరుకు చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నేత అనుమతితో కాగ్నా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కొడంగల్ పోలీసులు గురువారం ఒక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారని ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఇసుకను తరలిస్తున్న సదరు వ్యక్తులు తమకు అధికార పార్టీ నాయకుల మద్దతు ఉందని పోలీసులతో వాదించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాగ్నా వాగు నుంచి దర్జాగా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాగులో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు మంచి నీటిని అందించే పంప్ హౌజ్‌లున్నాయి. ఇసుకను తరలించడంతో తాగునీటికి ఇబ్బంది వచ్చే అవకాశం ఉంది.

మా షెడ్‌లోనే పార్కింగ్ చేయాలి

- జేపీదర్గా వద్ద కస్టమర్‌పై వ్యాపారుల జులుం
- కారు యజమాని, కుటుంబ సభ్యులపై దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు

కొత్తూరు: జేపీ దర్గాకు వెళ్తున్న వారి కారును అడ్డగించడంతో పాటు వారిపై దాడికి పాల్పడిన వ్యాపారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన రాజు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కారులో ఇన్ముల్‌నర్వలోని జేపీదర్గాకు బయలుదేరాడు. దర్గా ఆవరణలోకి చేరుకోగానే అక్కడి వ్యాపారులు షేక్ బురాన్, సయ్యద్ జమీన్ వారి కారును అడ్డగించి.. తమ షెడ్డులో వాహనాన్ని పార్కింగ్ చేయడంతో పాటు తమవద్ద పూలు కొనుగోలు చేయాలని వాదనకు దిగారు. ఈ క్రమంలో రాజు, వ్యాపారులకు మధ్యన వాగ్వాదం చోటుచేసుకోగా వ్యాపారులు.. రాజు, అతడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి మృతి కేసులో పురోగతి

- తెలిసినవారే హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసుల దర్యాప్తు
- త్వరలో పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం

ఇబ్రహీంపట్నంరూరల్: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 18న నమోదైన వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు సమాచారం. వివరాలు.. నాదర్‌గుల్‌లోని వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటున్న గడ్డం కళావతి(76) ఈనెల 18న తన గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. కళావతిది సాధారణ మృతి కాదు.. ఎవరో హత్యచేసి ఉంటారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కళావతి మృతికి ముందురోజు సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె ఉండే గదికి వచ్చి రాత్రి 10 గంటల వరకు ఆమెతోనే ఉన్నట్లు విచారణలో తేలినట్లు.. అతను ఎవరై ఉంటాడా అని సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. తెలిసిన వ్యక్తులే కళావతి వద్ద ఉన్న బంగారు గాజులను కాజేయడం కోసం ఆమెను హత్యచేసి ఉంటారేమో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేసుకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే పోలీసులు వెల్లడించనున్నట్లు తెలిసింది. కాగా వృద్ధురాలి మెడకు, చెవులకు ఉన్న బంగారం మాత్రం విడిచిపెట్టి చేతి గాజులు మాత్రమే దొంగిలించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వ స్థలంలో కాంపౌండ్ వాల్



ఎస్‌ఐ బల్‌రామ్‌కు ఫిర్యాదు చేస్తున్న వితాయిపల్లి గ్రామస్తులు

- ఆమనగల్లు వితాయిపల్లిలో ఫ్రైవేట్ వెంచర్ యాజమాన్యం నిర్వాకం
- చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో గ్రామస్తుల ఫిర్యాదు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని వితాయిపల్లిలో ప్రభుత్వానికి అప్పగించిన భూమిని ఓ ప్రైవేట్ వెంచర్ యాజమాన్యం ఆక్రమించిందని ఆ గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ బల్‌రామ్‌కు వారు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీలో విలీనానికి ముందు గ్రామ పంచాయతీగా ఉన్న వితాయిపల్లిలో సర్వే నంబర్లు 56, 57, 59-ఏలో ఓ ప్రైవేట్ వెంచర్ యాజమాన్యం వెంచర్ ఏర్పాటు చేసిందని అందులో పదిశాతం భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించిందని అన్నారు. తదనంతరం సదరు యాజమాన్యం ఆ పదిశాతం భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుందని తెలిపారు. ఈ విషయమై 2019 డిసెంబర్ 18న ఆమనగల్లు మున్సిపాలిటీలో ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఇదేవిషయమై 2023లో మరోసారి మున్సిపాలిటీలో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి ప్రభుత్వ భూమిలో వేసిన హద్దురాళ్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారని తెలిపారు. తాజాగా ఈనెల 20న తిరిగి సదరు యాజమాన్యం ప్రభుత్వ భూమి చుట్టూ కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతాలు, గ్రామస్తులు.. సాలయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, రమేశ్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్, నర్సింహ, పుల్యానాయక్, రవి, మురళి, రవీందర్, అనిల్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే



యువకుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

గాయపడిన యువకుడిని ఆస్పత్రిలో చేర్పించిన కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడిని అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వయంగా తన కారులో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారం గ్రామానికి చెందిన మహేష్ గురువారం కడ్తాల్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గమనించి వెంటనే గాయపడిన మహేశ్‌ను తన కారులో దగ్గర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాద వివరాలను కుటుంబ సభ్యులకు, స్థానిక సీఐకి తెలిపడంతో పాటు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కోకట్‌లో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

బొలెరోలో మూగజీవాలను తస్కరించేందుకు యత్నం

- రాళ్లతో దాడి చేసిన యజమానులు
- వాహనం వదిలి పరారైన దుండగులు



అపహరించేందుకు వాడిన వాహనం

యాలాల: మండల పరిధిలోని కోకట్‌లో గురువారం తెల్లవారుజామున మూగజీవాలను తస్కరించే దొంగల ముఠా హల్‌చల్ చేశాయి. పశువులను వాహనంలో ఎక్కించే క్రమంలో గ్రామస్తులు మేల్కొనడంతో దొంగలపై రాళ్లతో దాడికి దిగినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ తన ఇంటి సమీపంలో ఉన్న పాకలో ఆవు, దూడను కట్టేసి ఇంట్లో నిద్రించాడు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఓ బొలెరో వాహనంలో నలుగురు దొంగలు ఖాదర్ పాకలోని ఆవును, దూడను వాహనంలోకి ఎక్కించుకున్నారు. ఆయన ఇంటి సమీపంలో ఉన్న గొల్ల మల్లప్ప పాకలో ఉన్న పశువులను వాహనంలోకి ఎక్కించే క్రమంలో అలికిడికి నిద్రలేచారు. మల్లప్ప అరుస్తూనే దొంగలపై రాళ్లు రువ్వాడు. ఆయన శబ్దానికి మేల్కొన్న ఖాదర్‌తో పాటు గ్రామస్తులు దొంగలను వెంటాడారు. ఈ క్రమంలో దుండగులు బొలెరో వాహనంలో బాగాయిపల్లి మార్గంలో వెళుతున్నట్లు గమనించిన గ్రామస్తులు, బాగాయిపల్లిలోని తమకు తెలిసిన వారిని అప్రమత్తం చేశారు. దీంతో కొందరు బాగాయిపల్లి, పగిడియాలకు చెందిన యువకులు చౌరస్తాలో ట్రాక్టరుతో పాటు మరో వాహనాన్ని దారికి అడ్డుగా పెట్టారు. కొద్ది సేపటికి దొంగల బొలెరో వాహనం బాగాయిపల్లి చౌరస్తాలో దారికి అడ్డంగా వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ముద్దాయిపేట వైపు తమ వాహనాన్ని మళ్లించారు. స్థానికులు బైకులు, టవేరా వాహనంలో దొంగల వెంటపడ్డారు. ఈ క్రమంలో దుండగులు తమ వాహనాన్ని ముద్దాయిపేట మీదుగా బొంరాస్‌పేట పరిధిలోని జానకంపల్లి శివారులో వదిలి పరారయ్యారు. బాధితులు 100 డయల్ చేసి పోలీసులకు సమాచారమివ్వడంతో వారు కూడా ఘటన స్థలానికి చేరుకొని బొలెరో వాహనాన్ని యాలాల పీఎస్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుడు ఖాదర్ యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అసభ్యకర పోస్టుపై కేసు నమోదు

తాండూరు టౌన్: ఇన్‌స్టాగామ్‌లో ఓ వర్గానికి సంబంధించి అసభ్యకర పోస్టు పెట్టిన ఓ బాలుడిపై కేసు నమోదు చేసినట్లు గురువారం పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. తాండూరు పట్టణానికి చెందిన బాలుడు ఇన్‌స్టాగామ్‌లో అసభ్యకర పోస్టు పెట్టాడు. దీనిపై పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెడితే చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పదివేల ఓట్ల తొలగింపు

- వృద్ధులు, దివ్యాంగులకు ఓట్ ఫ్రమ్ హోమ్ అవకాశం
- కొత్తగా 13,308 యువ ఓటర్ల నమోదు
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో పదివేల ఓట్లు తొలగించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. అందులో డబుల్ ఓటర్లతో పాటు మృతిచెందిన వారి ఓట్లు ఉన్నాయన్నారు. కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో మొత్తం 5,56,741 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 2,85,131, మహిళలు 27,1534, ఇతరులు 66 మంది ఉన్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా మే 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎన్నికల సిబ్బంది వారి వద్దకే వెళ్లి ఓట్లు వేయిస్తారన్నారు. ఈసారి 13,308 మంది యువ ఓటర్లు కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 511 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మరో 26 అదనంగా ఏర్పాటు చేస్తామని.. 9 పోలింగ్ స్టేషన్లను మార్చుతున్నామన్నారు. రానున్న వారం రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఓటింగ్ స్లిప్పులు పంపిణీ చేస్తామన్నారు. జల్‌పల్లి ప్రాంతంలో ఓటర్ల నమోదు విషయమై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నివేదిక సమర్పించామన్నారు.

రూ.50వేలు దాటితే డబ్బు సీజ్..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వే బృందాల తనిఖీల్లో నియోజకవర్గ పరిధిలో రూ.1,13,85,000 విలువ గల డ్రగ్స్, రూ.4,33,526 విలువ గల 1400 లీటర్ల మద్యంతో పాటు రూ.35,37,500 నగదు పట్టుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు. రూ.50 వేల కంటె ఎక్కువ నగదు, రూ.10వేల కంటే ఎక్కువ విలువ గల బహుమతులు తరలిస్తే అధికారులు సీజ్ చేస్తారన్నారు. ఇళ్లల్లోకి వెళ్లి తనిఖీ చేసే అధికారం లేదని ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.